# రిటైర్డ్ వీఆర్‌వో శ్రీనివాసరావుకు ఘన సత్కారం


పదవీ విరమణ చేసిన శ్రీనివాసరావుని సత్కరించిన ఎంపీపీ శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట : శరభవరం వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన శ్రీనివాసరావుని నాయకులు, అధికారులు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. వీరిలో తహసీల్దార్ ఎస్.నాగమ్మ, ఎంపీడీవో, నాగేశ్వర్రావు, ఎస్‌ఐ రామకృష్ణారావు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వరలక్ష్మి, తెలుగుదేశం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చంద్రమౌళి, శరభవరం పంచాయితీ సర్పంచ్ పంచాడ చంద్ర పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలతో సమాజంలో గుర్తింపు


గొలుగొండ ఫారెస్టు సెక్షన్ అధికారి లక్ష్మణ్‌ను సన్మానం చేస్తున్న దృశ్యం

గొలుగొండ : ప్రభుత్వ ఉద్యోగంలో ప్రజలకు మంచి సేవలు అందిస్తే మంచి పేరు పొందడం జరుగుతుందని యలమంచిలి సబ్ డీఎఫ్‌వో సునీల్ తెలిపారు. గొలుగొండ అటవీశాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్ పదవీ విరమణ సందర్భంగా కృష్ణదేవిపేట రేంజ్ కార్యాయలంలో సన్మాన కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ అటవీశాఖలో పలు విధులు నిర్వహించిన లక్ష్మణ్ అన్ని ప్రాంతాల్లో మంచి పేరు పొందారని తెలిపారు. అటవీశాఖలో ఉద్యోగుల సంఘం నాయకుడుగా ఉత్తమ సేవలు అందించారని తెలిపారు. కృష్ణదేవిపేట రేంజర్ శ్రీనివాస్, డీఆర్‌వో సత్యనారాయణ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఈశ్వరప్రసాద్ సేవలు అందరికీ ఆదర్శం

రోలుగుంట : ఉపాధ్యాయుడిగా విద్యాభివృద్ధికి నిరంతర సేవలందించి సోమవారం పదవీ విరమణ చేసిన కె.ఈశ్వర ప్రసాద్ సేవలు పలువురికి ఆదర్శమని ఎంఈవో జానుప్రసాద్, ఉప సర్పంచ్ బంటు చిరంజీవి ఉపాధ్యాయ సంఘ నాయకులు అన్నారు. కొండపాలెం ఎంపీపీ స్కూలు ఎల్ఎఫ్ ఎల్ హెచ్‌ఎంగా కె.ఈశ్వర ప్రసాద్ పదవీ విరమణ చేశారు. సహచర ఉపాధ్యాయులు అతనికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎంఈవోతో పాటు కుసర్లపూడి స్కూల్ కాంప్లెక్ నోడల్ అధికారి శెట్టి మోహన్, రోలుగుంట హెచ్.ఎం., పి.వి.శేషగిరిరావు, ఉపాధాయ సంఘ నాయకులు బోనేల రాము, ఆర్.వి.ఎస్.ఆర్ శర్మ, బందారు నాని, ఏవీఎస్ ప్రసాద్, అశోక్ సామ్రాట్, శేషు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు నగదు అందిస్తున్న హెచ్‌ఎం విష్ణు

బుచ్చెయ్యపేట : సీతయ్యపేట హై స్కూల్ హెచ్‌ఎం గారపాటి విష్ణు మెరిట్ విద్యార్థులకు తన సొంత నిధులు రూ. 25 వేలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు కొండపల్లి శ్రీలక్ష్మి, గోకివాడ విజయజ్యోతి, కురందాసు ధన్య, ప్రవీణ్, గోకివాడ జ్యోతిలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదును డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనర్దనరావు నాయకులు వజ్రపు శ్రీను, బాబూరావు పాల్గొన్నారు.



## తనఖా పెడితే.. ఇంటినే స్వాధీనం


అండిబోయిన రమేష్

తనఖా పెట్టిన ఇంటిని శాశ్వతంగా స్వాధీనం చేసుకున్న వ్యక్తి నుంచి తనకు తిరిగి ఇప్పించాలని కోరుతూ రెండు నెలలుగా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదని అనకాపల్లి పట్టణానికి చెందిన దివ్యాంగుడు అండిబోయిన రమేష్ ఆరోపించారు. పట్టణంలో గాంధీనగరం అంజయ్యకాలనీలో ఫ్లాట్ నెం.7లో తన పేరున ఇల్లు ఉందని, ఆర్థిక అవసరాలతో వి.రమణ అనే వ్యక్తికి రూ.3 లక్షలకు తనఖా పెట్టానని, రెండేళ్ల తరువాత తిరిగి చెల్లించే ప్రయత్నం చేశానని, డబ్బు తీసుకోకుండా ఇల్లు తనది అంటున్నాడని వాపోయారు. దివ్యాంగుడైన తనను తీవ్రంగా వేధిస్తున్నాడని, న్యాయం చేయాలని పోలీస్, కలెక్టరేట్ అధికారులకు నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం జరగలేదన్నారు.

# ప్రతి వారం తప్పని ప్రదక్షిణలు

- కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు పోటెత్తిన అర్జీదారులు
- అర్జీల స్వీకరణతో సరిపెట్టేస్తున్నారని ఆవేదన
- మొత్తం 313 అర్జీల నమోదు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: అర్జీదారుల ఆవేదన, అసహనాల మధ్య సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం సాగింది. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రతి వారం ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులను ప్రశ్నిస్తే కలెక్టరేట్ సిబ్బంది జోక్యం చేసుకుని బయటకు పంపేస్తున్నారని పలువురు వాపోయారు. తక్షణమే స్పందించాల్సిన ఫిర్యాదులకు కూడా 75 రోజులు, 105 రోజులు గడువు చూపిస్తూ పీజీఆర్ఎస్ వెబ్‌సైట్ రూపొందించారని కూటమి సర్కారుపై అర్జీదారులు మండిపడుతున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, రమామణి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 313 అర్జీలు నమోదయ్యాయి.

- అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ జి.శివానందం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి లక్షల రూపాయలకు ఇతరులకు విక్రయించేశారని, తక్షణం అధికారులు స్పందించాలని కోరారు.

## చెరువును ప్రైవేటు భూమిగా మార్చేశారు..


చెరువును కాపాడాలంటూ నిరసన తెలుపుతున్న మూడు గ్రామాల యువకులు

నిన్నటి వరకు ప్రభుత్వ భూమిగా ఉన్న చెరువును.. నేడు రూ.20 కోట్ల విలువ చేసే ప్రైవేటు భూమిగా మార్చేస్తూ జిల్లా అధికారుల ఆదేశాలతో 22ఏ నుంచి తొలగించేసిన రెవెన్యూ అధికారులు తీరుపై నిరసనగా యలమంచిలి మన్సిపాలిటీ పరిధిలోని పెదపల్లి, మంత్రిపాలెం, పెదగొల్లలపాలెం గ్రామాల యువకులు కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం రెవెన్యూ పరిధిలో చెరువుగా ఉన్న సర్వే నం.286లో 12.49 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత భాగం 3.27 ఎకరాలను సర్వే నం.286-2బీగా సబ్ డివిజన్ చేసి ప్రైవేటు వ్యక్తుల పేరున రాసిచ్చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు భూమిని తనకు కేటాయిస్తూ కలెక్టర్ ప్రొసిడింగ్స్ ఇచ్చారంటూ అప్పలరాజు అనే వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, చెరువును కాపాడాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే ఆక్రమణలను ప్రోత్సహించడంపై మండిపడ్డారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి కలెక్టర్ మంజూరు చేసిన ప్రొసిడింగ్స్‌ను పునః పరిశీలించాలని, 22ఏ తొలగింపు ప్రొసిడింగ్స్‌ను రద్దు చేయాలని కోరారు.

## స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పూర్వీకుల నుంచి తన వాటాగా వచ్చిన స్థలాన్ని తన సోదరుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన దివ్యాంగుడు నెల్లిముక్కు అప్పలకొండ అర్జీ అందజేశారు. తన తండ్రి అప్పన్నకు గ్రామంలో ఉన్న 6 సెంట్లను మూడు భాగాలుగా విభజించి కుమారులకు కేటాయించినా పెద్ద తమ్ముడు ఈశ్వరుడు దౌర్జన్యం చేస్తున్నాడన్నారు.

# రైతులకు విత్తనాల పంపిణీ


జిల్లేడుపూడిలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారి సుగుణ

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావలసిన అన్ని ర కాలు వరి విత్తనాలు అందిస్తున్నామని వ్యవసాయశాఖాధికారి సుగుణ అన్నారు. ఆమె సోమవారం నాతవరం జిల్లేడుపూడి గ్రామాల్లో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 18వేలు ఎకరాల్లో వరినాట్లుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దానికి తగ్గట్టుగా మొదటి విడతలో 1731 క్వింటాళ్లు సిద్ధం చేశామన్నారు. మరో 100 క్వింటాళ్ల కోసం జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మండలంలో భూసార పరీక్షలు 1230 శాంపిల్స్ సేకరించి పంపించామన్నారు.

# లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

నర్సీపట్నం:జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి న్యాయవాదులు, పోలీసు అధికారులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ అన్నారు. కోర్టు ప్రాంగణంలో సోమవారం న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ జూలై 5న స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలన్నారు. కేసుల పెండింగ్ భారాన్ని తగ్గించడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి శ్రీభరణి ఉన్నారు.

# మహిళా సాధికారతతోనే సుపరిపాలన


కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమణమ్మ

నర్సీపట్నం:మహిళా సాధికారతతోనే గ్రామాల్లో సుపరిపాలన సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సుకల రమణమ్మ అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మహిళా సర్పంచ్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు మార్పు ద్వారా విజేతలు అనే అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రయినీలు జె.వి.పరమేశ్వరరావు, ఎం.బాబురావు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీటీసీ బోళెం రాంప్రసాద్, ఎంపీడీవో ఉషశ్రీ పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్‌ను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు


ప్రిన్సిపాల్ అన్నపూర్ణను ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట : కూటమి నేతల బెదిరింపులకు గుండెనొప్పి, ఫిట్స్‌తో ఆస్పత్రి పాలైన వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.అన్నపూర్ణను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. సోమవారం ఆమె నివాసంలో చికిత్స పొందుతుండగా మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, ఎస్సీ సెల్ కార్యదర్శి గుడాల ఆనంద్, నాయుడు ఆమెను పరామర్శించారు. ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన నాయకులు తన పట్ల అమానుషంగా ప్రవర్తించిన తీరును ప్రిన్సిపాల్ వివరించి కన్నీటి పర్యంతమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని ప్రిన్సిపాల్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యం చెప్పారు.

# 3న వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం : అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని స్వాతంత్రోద్యమ పోరాటంలో అల్లూరి పాత్ర అనే అంశంపై ఈ నెల 3న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఈ పోటీలకు డిగ్రీ విద్యార్థులు మాత్రమే అర్హులు అన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన వచ్చున్నారు. ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1000, తృతీయ బహుమతి రూ.500 చొప్పున విజేతలకు నగదు ప్రోత్సాహకాన్ని జయంతి రోజున ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

# బైక్‌ల దొంగ అరెస్ట్


బైక్ దొంగ వివరాలు తెలుపుతున్న పోలీసులు

అచ్యుతాపురం రూరల్ : వేర్వేరు చోట్ల ఐదు బైకులను దొంగతనం చేసిన కశింకోట మండలం చెరకాం గ్రామానికి చెందిన రెడ్డి పైడంనాయుడు పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ సుధాకర్ సోమవారం అచ్యుతాపురం కూడలిలో తనిఖీలు చేస్తుండగా టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్న రెడ్డి పైడంనాయుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టగా వేర్వేరు చోట్ల 5 బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అచ్యుతాపురం పోలీసులు తెలిపారు.

## ఏకధాటిగా చిరుజల్లులు

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవార జాము నుంచి ఏకధాటిగా చిరుజల్లులు కురిసాయి. రోడ్లన్నీ వర్షపునీటితో నిండి బురదమయంగా మారడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంత పొలాల్లో వర్షపు నీరు చేరింది. సాగునీటి చెరువులు సైతం నీటితో కళకళలాడుతున్నాయి.

## గిట్టుబాటు కాని అనాస పండ్లు


మాడుగుల వారపు సంతలో రాశులుగా పోసిన అనాస పండ్లు

మాడుగుల : మాడుగుల వారపు సంతకు సోమవారం అధికంగా అనాస పండ్లు వచ్చాయి. అయితే వర్షం కారణంగా దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు సంతకు రాకపోవడంతో అనాస పండ్లు రాశులు పోసి కొనుగోలు దారులు కోసం గిరి రైతులు ఎదురుచూశారు. గతంలో ఒక్కో పండు రూ.10 నుంచి రూ.15 వరకు ధరలు పలికేవి. కానీ ఈ వారం రూ.8లకు కూడా కొనుగోలు చేయలేదని గిరి రైతులు చెబుతున్నారు. పంటలు దిగుబడులు బాగున్నా సరే గిట్టుబాటు ధరలు రాలేదని వాపోయారు.

# చిన అప్పనపాలెంలో ఆలయ హుండీల చోరీ


నగదు తీసి హుండీని పడేసిన దొంగలు


సీసీటీవీ ఫుటేజీని పట్టుకుపోయిన దొంగలు

బుచ్చెయ్యపేట: మండలంలో చిన అప్పనపాలెంలో పైడితల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం ఉదయం గుడికి వెళ్లిన భక్తులు ఇక్కడ తలుపులు తెరచి, హుండీలు లేకపోవడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అమ్మవారి మెడలో వస్తువులతోపాటు ఆలయంలో సీసీటీవీ హార్డ్ డిస్క్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. ఆలయంలో హుండీ, గర్భగుడిలో మరొక హుండీతోపాటు పంచలోహ విగ్రహానికి ధరించిన పావు తులం బంగారు మంగళసూత్రాలు, 10 తులాల వెండి తాడులు ఎత్తుకుపోయారు. అమ్మవారి మెడలో ఉన్న మరో 50 తులాల వెండి వస్తువులను తీసి పక్కన పడేశారు. పగులగొట్టిన ఒక హుండీని ఆలయం వెనకాల, మరో హుండీని, తాళాలను పంట పొలంలో పారేశారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీంని రప్పించి విచారణ చేస్తున్నారు.

## చోడవరం ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్

**అనకాపల్లి:** జిల్లాలో బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ అన్నపూర్ణను మానసిక వేధింపులకు గురిచేసిన చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజుపై కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల చోడవరం ఎమ్మెల్యే సిఫార్సు చేసిన వారికి సీట్లు కేటాయించలేదని అక్కసుతో తన ఆఫీసుకు పిలిపించుకుని 50 మంది అనుచరులు సమక్షంలో అవమానకరంగా మాట్లాడడంతో ప్రిన్సిపాల్ స్పృహతప్పి పడిపోయారన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన అత్యధిక మంది విద్యార్థినులకు సీట్లు ఇచ్చి ఆమె ప్రజల మన్ననలు పొందారన్నారు. అటువంటి మహిళా ఉద్యోగి గౌరవాన్ని అధికార దుర్వినియోగంతో దెబ్బతీయడం సరికాదన్నారు. మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు స్వీకరించకపోతే, డిపార్టుమెంట్ అధికారులతో విచారణ చేయించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగానీ దుర్మార్గంగా వ్యవహరించడం హేయమన్నారు.

# వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- నల్లబాడ్జీలతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిరసన



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

**నర్సీపట్నం :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో సభ్యుల మధ్య వాడివేడిగా చర్చ కొనసాగింది. ఈ సమావేశానికి అధికారపక్ష, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నల్లబాడ్జీలు ధరించి విచ్చేసారు. నల్లబాడ్జీలు ఎందుకు ధరించారో స్పష్టత ఇవ్వాలని టీడీపీ కౌన్సిలర్ పద్మావతి పాలకపక్ష కౌన్సిలర్లను కోరారు. వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర కల్పించుకొని గత సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చ జరుగుతుండగా టీడీపీ కౌన్సిలర్ మధు వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణపై దాడికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ నల్లబాడ్జీలు ధరించామని సమాధానం ఇచ్చారు. అనంతరం అధికారులు అజెండాలోని 18 అంశాలను కౌన్సిల్ ముందుంచారు. 14వ అంశంపై పాలకపక్ష కౌన్సిలర్ బుల్లిదొర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన ప్రాపర్టీ వివాదం కోర్టులో ఉండగా ఒక వ్యక్తికి చెందిన ప్రాపర్టీగా ఎలా నిర్ణయిస్తారని అధికారులను నిలదీసారు. డాక్యుమెంట్ల ఆధారంగా నిర్ణయం తీసుకునే అధికారం తనకు ఉందని కమిషనర్ సురేంద్ర సమాధానం ఇచ్చారు. ఈ అంశంపై కౌన్సిలర్, కమిషనర్ మధ్య వాడివేడిగా వాదోపవాదనలు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో తన వార్డుకు రూ.8 లక్షలతో అభివృద్ధి చేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అధికారులకు సూచించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కుక్కల బెడదను జనసేన కౌన్సిలర్ సాజన్య కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన తెలియజేసిన కార్మికుల ఆందోళనకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు.

## మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు మాదంనాయుడు, చైతన్య

**కె.కోటపాడు :** మురుగునీటిలో వృద్ధి చెందే దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు మాదంనాయుడు, చైతన్య అన్నారు. మలేరియా మాసోత్సవాల ముగింపు సందర్భంగా చౌడువాడ గ్రామంలో సోమవారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని జరిపారు. వారం రోజులకు మించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజృంభించిన వైరల్ జ్వరాలు



మాడుగుల ఆసుపత్రికి వచ్చిన జ్వర బాధితులు

**మాడుగుల :** వాతావరణం మార్పు చెందడంతో పాటు వారం రోజుల నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలో జ్వర బాధితులు పెరుగుతున్నారు. సోమవారం మాడుగుల 30 పడకల ఆస్పత్రికి జ్వరాలతో సుమారు 350 మందికి పైగా వచ్చారు. వైద్యాధికారి శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. సీజన్ రావడంతో కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యాధికారి సూచించారు.




అంకితభావంతో పనిచేసే వారికి

# ఎల్లప్పుడూ గుర్తింపు



బదిలీపై వెళ్తున్న పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, కార్యదర్శుల సత్కార సభలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఏవో పార్థసారథి తదితరులు

**నాతవరం :** ప్రజలు మన్ననలు పొందే విధంగా ప్రతి ఉద్యోగి పని చేస్తే వారికి సమాజంలో ఎల్లప్పుడు గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో పంచాయతీ విస్తరణాధికారిగా పని చేస్తున్న ఎస్.ఎస్.మూర్తికి అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగుడ మండలానికి బదిలీ అయింది. అలాగే పంచాయతీ కార్యదర్శులు డి.యర్రవరంలో పని చేస్తున్న ఎస్.కె.రంజాన్, పి.జగ్గంపేటలో పనిచేస్తున్న డి.దేముడు, వల్సంపేట కార్యదర్శి జి.అప్పలస్వామి, ఎస్.బి.పట్నం కార్యదర్శి జె.స్వామినాయుడు, వై.బి.పట్నం కార్యదర్శి ఎల్.చిన్నంనాయుడుకు వేరొక మండలాలకు బదిలీ అయ్యారు. వారిని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ఎం.ప్రసాద్, పంచాయతీరాజ్‌శాఖ జేఈ శ్రీవెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సంఘం మండల శాఖ అధ్యక్షుడు లాలం శేషుకుమార్ పాల్గొన్నారు.

## వీఆర్వోకు ఘన వీడ్కోలు



వీఆర్వో రమణ దంపతులను సత్కరిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ, సిబ్బంది

**మాకవరపాలెం :** పదవీ విరమణ చేసిన వీఆర్వోను ఘనంగా సత్కరించారు. మండలంలోని తాడపాల వీఆర్వోగా పనిచేస్తున్న కాళ్ల రమణ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో దంపతులను తహసీల్దార్ బి.వెంకటరమణ, డీటీ నూకరాజుతోపాటు ఇతర సిబ్బంది రమణను సత్కరించి ఘన వీడ్కోలు పలికారు. ఉత్తమ సేవలు అందించే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

# పాత బోరు సామాన్లు వేలం



వేలంపాటలో పాల్గొన్న ఎంపీడీవో కొంకి అప్పారావు తదితరులు

**మాడుగుల :** స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో పాత బోరు సామాన్లు సోమవారం ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. రూ.5 ధరావతు చెల్లించి వేలంపాటలో ఆరుగురు సభ్యులు పాల్గొన్నారు. రావికమతం గ్రామానికి చెందిన బి.శ్రీను, ఇనుప పైపులు కిలో రూ.54లకు సొంతం చేసుకున్నారు. మాడుగుల మండలం పోతనపూడి గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణ, కిలో రూ.32లకు పాట దక్కించుకున్నారు. అలాగే పనిరాని ఇత్తడి సామాన్లు రూ.450లకు రావికమతం గ్రామానికి చెందిన బి.శ్రీను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లేశ్వరి, సూపరింటెండెంట్ గోపాల్, సీనియర్ అసిస్టెంట్ డి.సురేష్ పాల్గొన్నారు. పాట దక్కించుకున్న వారు ప్రభుత్వానికి నగదు చెల్లించి వెంటనే సామానులు తీసుకువెళ్లాలని ఎంపీడీవో కోరారు.

# దోమల మందు పిచికారీ

**మాడుగుల రూరల్ :** గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు దోమల నివారణ మందు (ఐ.ఆర్.ఎస్) రెండో విడత స్ప్రేయింగ్ జాలంపల్లి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా మలేరియా అధికారుల ఆదేశాల మేరకు దోమల నివారణ స్ప్రేయింగ్ చేపట్టారు. చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ పర్యవేక్షణలో వచ్చే నెల 15వ తేదీ వరకు గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా స్ప్రేయింగ్ చేపట్టనున్నారు. కార్యక్రమంలో కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి సోముదొర, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ఆందోళన వద్దు

**నాతవరం :** సీజనల్‌గా వచ్చే జ్వరాలు పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని నాతవరం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి రవితేజ అన్నారు. ఆయన నాతవరంలో సోమవారం సుమారుగా 100 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధికంగా జ్వరాలు అధిక శాతం మందికి వస్తున్నాయన్నారు. మేము ఇచ్చే మందులతో జ్వరం తగ్గిపోతుందన్నారు. మజ్జిగ వివిధ రకాల పండ్ల రసాలు తీసుకుంటే క్రమేపీ నొప్పులు తగ్గుతాయన్నారు.

## సబ్‌జైలును తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



కిచెన్‌లోని నిత్యావసర సరుకుల ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

**నర్సీపట్నం :** సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ సోమవారం తనిఖీ చేశారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై జడ్జి ఖైదీలను ఆరా తీశారు. ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఖైదీలకు మంచి భోజనాన్ని అందించాలని జైల్ సిబ్బందిని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చునని జడ్జి ఖైదీలకు సూచించారు.

## నేడు ముకుందపురంలో పైడితల్లమ్మ పండగ

**మాడుగుల రూరల్ :** ముకుందపురం గ్రామంలో మంగళవారం పైడితల్లమ్మ పండగ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీ అని సర్పంచ్ కర్రి గణేష్ సోమవారం తెలిపారు. ఈ పండగ సందర్భంగా ఈ నెల 27వ తేదీన అమ్మవారి ఘటాలు గ్రామంలో ప్రారంభించారు. పండగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామంలో నేలవేషాలు, బాణసంచాతో అమ్మవారి ఘటాలు ఊరేగింపు జరుగుతుందన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

## 20న కేజేపురం మోదమాంబ జాతర

**మాడుగుల రూరల్ :** కె.జె.పురం గ్రామంలో ప్రతి ఏటా ఆషాడ మాసంలో నిర్వహించే మోదమాంబ జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షునిగా సర్పంచ్ జామి రమణబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్‌గా రాపేట జోగినాయుడు, ఉపాధ్యక్షులుగా రాపేట రాజశేఖర్‌నాయుడు, శాశ్వత కమిటీ చైర్మన్‌గా బోద్దేడ సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు కోశాధికారిగా ఆడారి బాబ్జీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ జోగినాయుడు సోమవారం తెలిపారు. వీరితో పాటు ప్లానింగ్ కమిటీ సభ్యులుగా కాళ్ల నర్సింగరాజు, శరగడం ఆదిబాబు, మద్దాల రమణ, సలహా సభ్యులుగా కర్రి మల్లికార్జునరావు, పాలకుర్తి శ్రీనివాసరావు, నాచు సునీల్, యల్లపు పెంటయ్య, ఉత్సవ కమిటీ సభ్యులుగా మరో 24 మందిని నియమించారు. వీరి సారథ్యంలో జాతర విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్టు జోగినాయుడు తెలిపారు.

## నరసింహ అవతారంలో జగన్నాథుడు



**మాడుగుల:** జగన్నాథ రథోత్సవంలో భాగంగా సోమవారం జగన్నాథుడు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పండా నూకరాజు ఆధ్వర్యంలో తెల్లవారు నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం ఇంద్ర ద్యుమ్నం ప్రాంగణంలో మహిళా కోలాటాలు నిర్వహించారు. మాడుగుల, ఎం.కోడూరు, సత్యవరం, జంపెన, ఎం.కోటపాడు, సాగరం, తాటిపర్తి, కేజేపురం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## రాయి క్వారీని రద్దు చేయాలంటూ నిరసన



క్వారీ బాధితుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న తహసీల్దార్ రామారావు

**నర్సీపట్నం :** ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తహసీల్దార్ ఎల్.రామారావు పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్డీవో వి.వి.రమణ కార్యాలయ పని మీద వెళ్లడంతో నర్సీపట్నం తహసీల్దార్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. మాకవరపాలెం మండలం, కోడూరు రాయి క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సమీపంలో భూములు ఉన్న దళితులు బీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. రాయి క్వారీని వెంటనే రద్దు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బి.నాగరాజు అధికారులను డిమాండ్ చేశారు. అధికారుల మొండివైఖరి నశించాలంటూ బాధితులు నినాదాలు చేశారు. అనంతరం పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసారు. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్తానని తహసీల్దార్ బాధితులకు హామీఇచ్చారు.

## కొత్త నిబంధనలు అనుసరించి డ్వాక్రా రుణాలు



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం కనకరాజు

**నాతవరం:** కొత్తగా వచ్చిన ప్రభుత్వ నిబంధనలు అనుసరించి డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు ఇస్తామని వెలుగు ఏపీఎం కనకరాజు అన్నారు. వెలుగు కార్యాలయంలో సోమవారం డ్వాక్రా సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొత్తగా వచ్చిన నిబంధనల మేరకు ఏడాదిలో ఇచ్చే రుణాల కోసం యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామన్నారు. దానికి అనుగుణంగా బ్యాంకు లింకేజీ ద్వారా డ్వాక్రా సంఘాలకు రూ.35 కోట్లు రుణాలు లక్ష్యం పెట్టుకున్నట్టు తెలిపారు. . సీనియారిటీ గల డ్వాక్రా గ్రూపులకు సభ్యురాలికి రూ.2 లక్షలు వరకు బ్యాంకు లింకేజి రుణాలు ఇస్తున్నామన్నారు. మండలంలో ఈ ఏడాది స్త్రీనిధి ద్వారా రూ.11 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఉపాధి కోసం కొత్తగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే సభ్యులకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. మండల వ్యాప్తంగా 200 మంది ఎన్యూమేటర్లను నియమించి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామన్నారు. వారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇస్తామన్నారు.